క్లుప్తంగా

గౌడ సంఘ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో గౌడ సంఘ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం గ్రామ అధ్యక్షుడిగా చిన్న వెంకాగౌడ్, కోశాధికారిగా రాజుగౌడ్, సభ్యులుగా రాజేశ్, నారాయణ, రామాగౌడ్, బట్టినారాయణగౌడ్, బుచ్చాగౌడ్, రాజగౌడ్, లక్ష్మీపతిగౌడ్, లస్మగౌడ్ తదితరులు ఎన్నికయ్యారు.

యూరియా కోసం క్యూ



లోకేశ్వరం: రైతులను యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. మండలంలోని రాయపూర్‌కాండ్లీలో రెడ్డి సంఘ భవనం వద్ద రైతులు మంగళవారం యూరియా టోకెన్ల కోసం బారులు తీరారు. హాక కేంద్రంలో ఒక రైతుకు నాలుగు బస్తాల టోకెన్లు అందించారు.

కృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న యువకులు

ఖానాపూర్: పట్టణంలో మంగళవారం రాత్రి పట్టణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల అనంతరం జారుడుగుంజ పాకుడు ఏర్పాటు చేశారు. అనంతరం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జగన్నాథ్‌రావు చౌరస్తాలో ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. విజేతలకు సేవా భారతి సొసైటీ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. సీఐ అజయ్, ఎస్సై రాహుల్, రాజుయాదవ్, శ్యాంమోహన్ రావు, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, బీసీ రాజన్న, తోట సత్యం తదితరులున్నారు.

సీఆర్టీల వేతనాలు చెల్లించాలి

తానూరు: ఆశ్రమ పాఠశాలలో పని చేసే సీఆర్టీల వేతనాలు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని.. వెంటనే చెల్లించాలని ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ అన్నారు. మంగళవారం తానూరులోని ఆశ్రమ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎండీ మొయినొద్దీన్, నాయకులు ప్రకాశ్, రావుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో ఎస్సీ, ఒడ్డెర కాలనీల్లో విద్యుత్ సమస్య పరిష్కరించినట్లు ఏఈ మహేశ్ మంగళవారం తెలిపారు. విద్యుత్ సక్రమంగా ఉండటం లేదని కాలనీవాసులు ఆదివారం సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఇచ్చిన హామీ మేరకు రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరించినట్లు ఏఈ పేర్కొన్నారు.

యంత్రం సీజ్

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తోడుతున్న యంత్రాన్ని, ట్రాక్టర్ ఇంజిన్‌ను మంగళవారం ఆర్‌ఐ నరేందర్‌రెడ్డి, పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వాటిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో పీసీలు భీమ్‌సింగ్, గణేశ్ ఉన్నారు.

మైక్‌సెట్ విరాళం

మామడ: మండలంలోని దిమ్మదుర్తి ప్రాథమికోన్నత పాఠశాలకు మంగళవారం ఖానాపూర్ వాసవీక్లబ్ అధ్యక్షుడు రవీందర్ రూ.10 వేల విలువైన మైక్‌సెట్‌ను విరాళంగా అందించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు నర్సయ్య, మోహన్, రత్నయ్య, సహదేవ్, సురేందర్‌గౌడ్, లక్ష్మణ్, గంగాగౌడ్, ఉపాధ్యాయులు పోశెట్టి పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకోం'

కుభీర్: బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకోమని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం కుభీర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విఠల్‌రెడ్డి తన హయాంలో 20 ఆలయాలకు నిధులు, అన్ని కులసంఘాలకు కమ్యూనిటీ హాళ్లు, గ్రామాలకు సీసీరోడ్లు, బీటీరోడ్లు మంజూరు చేయించారని పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ కల్యాణ్, షేక్‌హైమద్, సంతోష్, కె.సాయినాథ్, విజయ్ తదితరులు ఉన్నారు.

ఈనెల 4న తానూరు మండలం మసల్గాతండా గ్రామానికి చెందిన జాదవ్ దేవిదాస్ అనే రైతు తన వ్యవసాయ క్షేత్రం వద్ద రెండు ఎడ్లను కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి చేను వద్దకు చిరుతపులి వెళ్లి దాడి చేసి ఓ ఎద్దును హతమార్చింది. మరో ఎద్దు తప్పించుకునే క్రమంలో మెడకు ఉరిపడి ఊపిరాడక మృతిచెందింది.

ఈనెల 14న ఆదివారం ఝరి(బి) అటవీ ప్రాంతంలో బెంబరకు వెళ్లే కాలినడక మార్గంలో చిరుత సంచరిస్తున్న దృశ్యాలను గ్రామానికే చెందిన సాయినాథ్ తన ఫోన్‌తో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీంతో సమీప గ్రామాల ప్రజలు మళ్లీ చిరుత వచ్చిందని భయాందోళన చెందుతున్నారు.

కలవరపెడుతున్న చిరుత

- తరచూ పశువులపై దాడి
- భయాందోళనలో సరిహద్దు గ్రామాల ప్రజలు
- అధికారులూ పట్టించుకోవడం లేదని ఆవేదన



మసల్గాతండాలో చిరుత దాడిలో మృతి చెందిన ఎద్దు కళేబరం పరిశీలిస్తున్న అధికారులు, స్థానికులు

తానూరు: జిల్లాలోని తానూరు మండలంలో కొద్ది రోజులుగా చిరుత సంచారం ప్రజలను కలవరపెడుతోంది. తరచుగా పశువులపై దాడి చేస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. పలు మార్లు విన్నవించినా అధికారులూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

గుట్ట ప్రాంతంలో అలజడి..

తానూరు మండలంలోని మొగ్గి, మసల్గా, మసల్గా తండా, ఝరి(బి), ఝరి(బి)తండా, బెంబర, హిప్నెల్లి, హిప్నెల్లితండా, వడ్‌ఝరి(బి), బోరిగాం, ఎల్వి, మహలింగి, బామ్ని, భోసి గ్రామాలు గుట్టను ఆనుకొని ఉన్నాయి. ఈ అటవీ ప్రాంతాల్లో ఎక్కడో చోట చిరుత సంచరిస్తూ తరచుగా పశువుల మందపై దాడి చేస్తోంది. దీంతో సరిహద్దు గ్రామాల ప్రజలు వామ్మో.. చిరుత అంటూ భయాందోళన చెందుతున్నారు.

జంకుతున్న రైతులు..

మండలంలోని సరిహద్దు గ్రామాల్లో అటవీ ప్రాంతం కలిగి ఉండడంతో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. మసల్గాతండాలో చిరుత దాడిలో ఎద్దు మృతి చెందడంతో రాత్రి పంటలకు కాపలా వెళ్లడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ఉన్నా రాత్రివేళ ఇతర గ్రామాలకు వెళ్లడం లేదని అధికారులు చిరుత పులి సంచారం గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు విఫలం..

పశువులపై చిరుత దాడులు చేసినప్పుడు మాత్రమే అటవీశాఖ అధికారులు వచ్చి ఆనవాళ్లను గుర్తిస్తారు. ఆ తర్వాత చర్యలు చేపట్టడంలో మాత్రం పూర్తిగా విఫలమవుతున్నారు. ఇప్పటికైనా అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం బాధ్యత అటవీశాఖ అధికారులపై ఉంది.

జరిగిన ఘటనలు..

- గతేడాది బెంబర గ్రామ శివారులో లచ్చన్న అనే రైతు తన చేను వద్ద ఆవులను కట్టేసి ఇంటికి వచ్చాడు. మందపై చిరుతపులి దాడి చేసింది. అందులోని ఓ దూడను చంపి చెట్టు మీదకు తీసుకెళ్లి తినేసింది. ఉదయం గమనించిన రైతు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చాడు. బీట్ అధికారి మహేశ్ వచ్చి చిరుత దాడిలో దూడ మృతి చెందినట్లు ధ్రువీకరించారు.
- గతేడాది మహలింగి శివారులో గ్రామానికి చెందిన జంకోడ్ విఠల్ అనే రైతు వ్యవసాయ క్షేత్రం వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి చిరుత ఆవుపై దాడి చేయగా కేకలు విని చేను వద్దకు వెళ్లేసరికి చిరుత అక్కడి నుంచి పారిపోయింది. అదే గ్రామానికి చెందిన హల్దా భోజన్న ఆవును హతమార్చింది.
- గతేడాదిన్నర కిందట బామ్ని శివారులోని అటవీ ప్రాంతంలో బామ్ని గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ ఆవుపై చిరుత దాడి చేసి హతమార్చింది.
- ఆరు నెలల కిందట బెంబర-ఝరి(బి)అటవీ ప్రాతంలో చిరుత మేకను చంపేసింది.

కాడెద్దు మృతి.. రైతుకు తప్పిన ముప్పు

- తెగిపడిన విద్యుత్ తీగ



ఎద్దు కళేబరం

లోకేశ్వరం: తెగిపడిన విద్యుత్ సరఫరా అవుతున్న తీగ తగిలి కాడెద్దు మృతి చెందగా.. రైతు బయటపడ్డ ఘటన మండలంలోని బాగాపూర్ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలకేంద్రంలోని దొడ్ల నరేశ్ తన కాడెడ్లను బాగాపూర్ శివారులోకి మేత కోసం తోలుకెళ్లాడు. బంధువులు మరణించిన విషయం తెలియడంతో ఎడ్లను ఇంటికి తీసుకెళ్లాలని అదే గ్రామానికి చెందిన కొండపురం రాజేశ్వర్‌కు చెప్పి వెళ్లిపోయాడు. సాయంత్రం రాజేశ్వర్ వ్యవసాయ పనులు ముగించుకుని ఎడ్లబండిలో మేత వేసుకొని ఇంటికి బయలుదేరాడు. కొంచెం దూరం వెళ్లగానే విద్యుత్ సరఫరా అవుతున్న తీగ ఎద్దు కాలుకు తగలడంతో అక్కడికక్కడే మరణించింది. మరో ఎద్దు, రైతుకు ప్రమాదం తప్పింది. ఎద్దు విలువ రూ.65 వేలు ఉంటుందని.. నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

దివ్యాంగ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

నిర్మల్ రూరల్ : జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు, ప్రోత్సాహకాలు అందించడానికి కృషి చేస్తున్నామని విలీన విద్య జిల్లా సమన్వయకర్త ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జుమ్మేరాత్‌పేట్ ఉన్నత పాఠశాలలో ప్రశస్త యాప్, దివ్యాంగ విద్యార్థులకు అందించే ప్రోత్సాహకాలపై ప్రత్యేక ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడారు. జిల్లాలో మొత్తం 1,830 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారన్నారు. కొత్తవారి గుర్తింపు ప్రక్రియ చేపట్టామన్నారు. విద్యార్థుల్లో ప్రోత్సాహకాలకు అర్హులను గుర్తించి వారికి బ్యాంకు అకౌంట్లు తీయించి, ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం రవిబాబు, ఆర్పీలు రాజశేఖర్, విఠల్, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కేజీబీవీలో భోజనం పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి, డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు కేజీబీవీని సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం కుంటాల పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో సమావేశమయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందిచాలని ఆదేశించారు. వైద్యురాలు శృతిరెడ్డి, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఎస్‌ఓ సువర్ణ, పంచాయతీ కార్యదర్శులు సతీశ్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ వేగం పెంచాలి



పొన్కల్‌లో పరిశీలిస్తున్న ఎంపీఓ ఉపేందర్

తానూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని హౌసింగ్ డీఈ దయానంద్ సూచించారు. మండలంలోని సింగన్‌గాం గ్రామంలో లబ్ధిదారులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తి చేసిన వారికి బిల్లులు సకాలంలో అందిస్తామన్నారు. గ్రామంలో ప్రారంభంలో ఉన్న ఇళ్ల నిర్మాణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ప్రతేక అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో నసీరొద్దీన్ ఉన్నారు.

లోకేశ్వరం: ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. లోకేశ్వరం, పుస్పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీవో సురేశ్‌చందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: ఇళ్ల నిర్మాణ పనులు అధికారులు నాణ్యతగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం అన్నారు. మండలంలోని రాజురాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ మేస్త్రీలతోపాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నాకర్‌రావు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మామడ: మండలంలోని పొన్కల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మండల పంచాయతీ అధికారి ఉపేందర్ పరిశీలించారు. నిబంధనలు పాటిస్తూ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి



కడెం: అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శ్రీలత

కడెం: పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషకాహారం ప్రాధాన్యతను గర్భిణులు, బాలింతలకు వివరించాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం కడెం మండలంలోని పెద్దబెల్లాల్ రైతువేదికలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. చిన్నారుల ఎదుగుదల, పౌష్టికాహారం వివరించాలని సూచించారు. సూపర్‌వైజర్లు షహనాజ్ పర్వీన్, రాధ, ప్రేమలత, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి రైతువేదికలో మంగళవారం ఖానాపూర్, పెంబి, మామడ మండలాల అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో శ్రీలత మాట్లాడారు. పోషకాహారంపై అవగాహన కల్పించడంతోపాటు ఆహార వైవిధ్యం ప్రాధాన్యంపై టీచర్లు వివరించాలన్నారు. టీచర్లతో గ్రూప్ డిస్కషన్, ప్రాజెక్ట్ తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్యామల, రజినీదేవి, టీచర్లు పాల్గొన్నారు.

'ఊరూరా విమోచన దినోత్సవం నిర్వహించాలి'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసాటౌన్: నియోజకవర్గవ్యాప్తంగా తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో విమోచన దినోత్సవ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో బీజేపీ నాయకులు జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. బీజేపీ నాయకులు గంగాధర్, పట్టణ, మండలాధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మరెడ్డి తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

లోకేశ్వరం: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన భోజన్న భైంసాలోని తన నివాసంలో ఎమ్మెల్యే పవార్‌రామారావు పటేల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. బీజేపీ మండల కన్వీనర్ సాయన్న, నాయకులు భాస్కర్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

బీడీ కార్మికులకు పింఛన్ అందించాలి



నిరసన తెలుపుతున్న బీడీ కార్మికులు

తానూరు: గత ప్రభుత్వంలో ఇచ్చినట్లు పీఎఫ్ కల్గిన బీడీ కార్మికులకు పింఛన్ అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.గంగాధర్ పేర్కొన్నారు. మంగళవారం బీడీ కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో తానూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు రూ.4,016 అందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మహేందర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోదావరి, కె.గంగాధర్, అమృత, కమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మత్స్య సహకార సొసైటీ ఏర్పాటు వద్దు'



నిర్మల్‌లో ఆందోళన చేస్తున్న పీచర గ్రామస్తులు

లక్ష్మణచాంద: తమ గ్రామంలోని ముదిరాజ్‌ల పేరిట మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీ ఏర్పాటు చేయొద్దని కోరుతూ మంగళవారం మండలంలోని పీచర గ్రామస్తులు నిర్మల్‌లోని కలెక్టరేట్ ముందు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని చెరువులను ముదిరాజ్‌ల పేరిట రిజిస్ట్రేషన్ చేయడం సరికాదన్నారు. చెరువులపై గంగపుత్రులు ఆధాపడి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. వారిని కాదని తమకు సొసైటీ ఏర్పాటు చేయాలని ముదిరాజ్‌లు కోర్టులు, కార్యాలయాల చుట్టూ తిరగడం సరికాదన్నారు. అన్నికులాల వారు అన్యోన్యంగా ఉంటున్నామని.. కొందరు కావాలని మా మధ్య గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇందులో పలువురు పీచర గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఓజోన్' రక్షణ అందరి బాధ్యత



నిర్మల్‌రూరల్: రత్నాపూర్‌కాండ్లీ బడిలో తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు, పక్కన టీచర్లు

నిర్మల్‌రూరల్: ఓజోన్ పొర రక్షణ అందరి బాధ్యత అని పలువురు పేర్కొన్నారు. మంగళవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని జిల్లాకేంద్రంతోపాటు, పలు పాఠశాలల్లో నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ పొరను కాపాడుతామని విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. మండలంలోని రత్నాపూర్ కాండ్లీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం విజయ స్వప్న, సైన్సు ఉపాధ్యాయులు వసంత, నవ్య ఉన్నారు. నిర్మల్‌లోని ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటారు.

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం రాజేశ్వర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శ్రీధర్‌రెడ్డి, అర్చన, మురళీమనోహర్‌రెడ్డి, విజయ్‌కుమార్, గంగాధర్, శంకర్ సింగ్, రవి ఉన్నారు.

బోధన నైపుణ్యాలు పెంచుకోవాలి

ఖానాపూర్: విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు నైపుణ్యాలు పెంచుకోవాలని ఎంఈవో సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన మండలస్థాయి టీఎల్‌ఎం ప్రదర్శన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు బోధనోపకరణాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆకర్షణీయంగా, సులభంగా, అర్థమయ్యేలా చెప్పే విధానం వివరించారు. అనంతరం ఖానాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజలింగం న్యాయ నిర్ణేతగా వ్యవహరించి 10 పాఠశాలలను ఎంపిక చేసి జిల్లాస్థాయి టీఎల్‌ఎం సదస్సుకు పంపనున్నట్లు ఎంఈవో తెలిపారు. సీఆర్పీలు సంతోష్, వనిత తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• హిందీ భాషా దినోత్సవం

ముధోల్: మండలకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం గీత హిందీ భాష విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

• స్టూడెంట్ కౌన్సిల్ ఏర్పాటు

కడెం: మండలంలోని లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్టూడెంట్ కౌన్సిల్ ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం వెంకటరమణ తెలిపారు. చురుకైన సేవాభావం కల్గిన 44 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

• తహసీల్దార్‌కు సన్మానం

సారంగపూర్: నూతన తహసీల్దార్ సంధ్యారాణిని మంగళవారం తన కార్యాలయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కాల్వ నరేశ్, నాయకులు విలాస్, తిరుమలచారి, చంద్రప్రకాశ్‌గౌడ్, సురేందర్ తదితరులు ఉన్నారు.

• కుంట నీరు కలుషితంపై ఆందోళన

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో బొడ్డోనికుంటలో డ్రైయినేజీ నీరు కలిసి కుంట నీరు కలుషితం కావడంపై కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం శాంతినగర్ యూత్‌తో పాటు చైతన్యయూత్, హనుమాన్ యూత్, సింహ యూత్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కుంట సమీపంలో చేపట్టిన ఆ రోగ్య ఉపకేంద్రం నిర్మాణాన్ని గంగపుత్ర సంఘం సభ్యులు అడ్డుకోవడం సరికాదన్నారు. సత్యనారాయణ, రమేశ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

• పాఠశాలలో నమూనా ఎన్నికలు

కుభీర్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు. అంతముందు విద్యార్థులకు ఓటు వేసే విధానం వివరించారు. బాలుర తరఫున శుభం, బాలికల ప్రతినిధిగా రుషిత గెలుపొందారు. హెచ్‌ఎం గంగాధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

• ధర్మారంలో వైద్యశిబిరం

లక్ష్మణచాంద: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య సహాయకుడు శివకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ధర్మారంలో డ్రైడే నిర్వహించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వరంతో బాధపడే వారి రక్త నమూనాలు సేకరించారు. మందులు అందించారు. వైద్య సిబ్బంది కల్యాణి, నవనీత పాల్గొన్నారు.

• పెండింగ్ వేతనాలు చెల్లించండి

ముధోల్: పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు త్వరగా చెల్లించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. మంగళవారం ముధోల్ ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పండుగలకు పస్తులుండేలా కార్మికుల జీవితం మారిందని.. ప్రతి కార్మికుడికి రెండు జతల బట్టలు, నిత్యవసరాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఉన్నారు.

'పీఏసీఎస్ కార్యదర్శిపై విచారణ చేయాలి'

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి పీఏసీఎస్ కార్యదర్శి అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ డైరెక్టర్ బలష్టు రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత కార్యదర్శి సత్తనపల్లి సంఘంలో 1994లో ఉద్యోగంలో సిబ్బందిగా చేరి 2006 వరకు పనిచేశాడన్నారు. 2006 నుంచి 2011 వరకు పాతఎల్లాపూర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడిగా ఉన్నాడన్నారు. ఈ ఐదేళ్లు పనిచేయకున్నా.. సదరు వ్యక్తికి రూ.4,50,000 సొసైటీ నుంచి ఏరియర్స్ రూపంలో తీర్మానం చేసి అక్రమంగా చెల్లించేందుకు అప్పటి చైర్మన్, సీఈవో సహకరించారన్నారు. తప్పుడు పేర్లు, పుట్టినతేదీలు ఇస్తూ అధికారులను తప్పు దోవ పట్టించి రూ.లక్షల రైతుల సొమ్మును దుర్వినియోగం చేస్తున్న సీఈవో, చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జిల్లా సహకార అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని.. తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్టీయూ పట్టణ కార్యవర్గం



సభ్యులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో మంగళవారం నిర్మల్ పట్టణ ఎస్టీయూ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా డి.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.డీ ఖాలిద్, ఆర్థిక కార్యదర్శిగా తాళ్ల లఖన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.రాజన్న, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి, ఇష్టాక్, పోశెట్టి, కృష్ణకుమార్, జిల్లా కౌన్సిలర్లుగా జుట్టు గజేందర్, జె.లక్ష్మణ్, ఇర్ఫాన్ షేక్, బి.వెంకటేశ్వరరావు, ఇంతియాజ్, సంతోష్‌కుమార్, ఎం.శ్రీనివాస్, రాందేవ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులను సన్మానించారు. ఎన్నికల పరిశీలకులుగా మా రెడ్డి శ్రీనివాస్ వ్యవహరించారు.

పంటల డిజిటల్ సర్వే

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో సాగు చేసిన పంటల డిజిటల్ సర్వేను మంగళవారం క్లస్టర్ ఏఈఓ గణేశ్ చేపట్టారు. క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో కలిసి ఫొటోలు తీశారు. రైతు వివరాలు, పట్టాదారుపాసు పుస్తకం, పంట, విస్తీర్ణం వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం సర్వే వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తామని ఏఈవో తెలిపారు.